క్లుప్తంగా

వృద్ధులకు ఓఆర్ఎస్ డ్రింకులు పంపిణీ



ఉంగుటూరు: మండలంలోని వెన్నూతల, తుట్టగుంట గ్రామాల్లో మన సేవక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 160 మంది వృద్ధులకు ఓఆర్ఎస్ డ్రింకులు ఆదివారం పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలను, పేద కుటుంబాల చదువులకు ఆర్థికంగా ఆదుకునేందుకు ఫౌండేషన్ ద్వారా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిళ్లపల్లి నాగసుబ్బారావు, చాగంటిపాటి రమేష్‌బాబు, దండిబోయిన నాగలక్ష్మి, లక్ష్మి సుకన్య పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతో ప్రాణశక్తి పెంపుదల



పెనమలూరు: మంచి ఆహారపు అలవాట్లతో మానవదేహంలో ఉన్న ప్రాణశక్తి కేంద్రాలను చైతన్యపర్చవచ్చని యోగాశక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. దత్తాశ్రమంలో ఆదివారం ఉచిత మోకాల నొప్పుల ఆక్యుప్రెజర్ చికిత్స శిబిరం ఆయన నిర్వహించారు. మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎలాంటి మందులు వాడకుండా మూల సమస్యను నిర్ధారణ చేసి ఆహారపు మార్పులతో ప్రాణశక్తి కేంద్రాలను చైతన్యం చేయగలుగుతామన్నారు. దేహానికి వ్యాయామం, మంచి ఆహారం, అనుకూలమైన వాతావరణం చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆయన 50 మందికి ఉచిత మోకాళ్ల చికిత్స చేశారు.

వయోజనులకు పరీక్షలు




పెనమలూరు: మండల పరిధిలో ఆదివారం వయోజన విద్యాకేంద్రం ఆధ్వర్యంలో ఉల్లాస్ పరీక్ష నిర్వహించారు. గత ఆరు నెలలుగా నిరక్షరాస్యులైన వయోజనులకు శిక్షణ తరగతులు వయోజన విద్యా కేంద్రం ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ పొందిన 311 మందికి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 307 మంది హాజరయ్యారు. జిల్లా వయోజన విద్యా కేంద్రం ఏపీవో అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆరు నెలల పాటు వయోజనులకు అక్షరాస్యులుగా తీర్చి దిద్దటానికి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కృష్ణంరాజు, ఇన్విజిలేటర్లుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సీసీలు, వీవోఏలు పలువురు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృత పరచాలి



కంకిపాడు: సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృత పరచాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలోని పావన్ గాయత్రీ ధ్యాన మందిర్‌లో ఆదివారం జిల్లా గవర్నర్ పర్యటన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వి.శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శేషగిరి మాట్లాడుతూ లయన్స్ సేవలను గ్రామాల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరికీ సేవా కార్యక్రమాలను చేరువ చేయాలని సూచించారు. క్లబ్‌లో సభ్యులను చేర్చుకోవటం ద్వారా బలోపేతం చేసుకోవాలన్నారు. అన్ని వర్గాలకూ సేవా కార్యక్రమాలు అందేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బండి నాంచారయ్య, మద్దుల యుగంధర్, మద్దుల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో ఇఫ్తార్ విందు



ఉయ్యూరు: రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని దయారా మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాస విరమణ చేసిన ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, వాకర్స్ క్లబ్‌అధ్యక్షుడు సత్తార్ పర్యవేక్షించారు.

ప్రమాదభరితంగా గోపవరపుగూడెం రహదారి

- రహదారి అంతటా గుంతలు
- ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆందోళన
- మరమ్మతులు చేయాలని వినతి



మలుపులో దెబ్బతిన్న రోడ్డు



మద్యం షాపు సమీపంలో గోతులమయంగా ఉన్న రహదారి



రాళ్లు తేలిన కేసరపల్లి-ఐటీ పార్కు రోడ్డు

గన్నవరం రూరల్: మండలంలోని కొన్ని గ్రామాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కనీసం నడిచేందుకూ వీలు లేని విధంగా మారాయి. రహదారులపై భారీ గోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గోపవరపుగూడెం రహదారి దారుణంగా దెబ్బతింది. చిక్కవరం, గోపవరపుగూడెం, గొల్లనపల్లి క్రాస్ రోడ్డు నుంచి మద్యం షాపు మీదుగా అనేక మలుపులతో ఉన్న ఈ ర హదారి గోతులు, గుంతలతో ఉంది. పట్టించుకోవాల్సిన ప్రభుత్వ శాఖలు నిమ్మకునీరెత్తినట్లు ఉండటంతో ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, రైతులు, వివిధ గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రహదారి మలుపుల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

పలు ప్రధాన రోడ్లకు ఇది లింకు రోడ్డు....

కొత్తగూడెం, చిక్కవరం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం రైతులు, వాహనదారులు ఆయా గ్రామాల ప్రజలు నిరంతరం ప్రయాణించే రహదారి ఇది. రోడ్డుకు ఇరువైపులా మిర్చి, టమాట, పత్తి వంటి పంటలు రైతులు సాగు చేస్తున్నారు. గోపవరపుగూడెం గ్రామం దాటి, హైవే బైపాస్ రోడ్డుకు చేరి నున్న వరకూ కొత్త బైపాస్ రోడ్డుపై ప్రయణాలు చేస్తున్నారు. అంతేగాక ముస్తాబాద, సూరంపల్లి, నున్న వెళ్లేందుకు పై గ్రామాల ప్రజలు ఈ రోడ్డు పైనే నిరంతరం ప్రయాణాలు చేస్తుంటారు. గోపవరపుగూడెం గ్రామంలో నుంచి కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం గ్రామాలకు ప్రజలు నిరంతరం ప్రయాణిస్తుంటారు. వ్యవసాయం, కూలీ పనులే ప్రధానంగా జీవన విధానంగా ఉన్న ప్రాంతంలో ఈ రోడ్డుపై ఉన్న గోతులు గుంతలు బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రి వేళ ప్రమాదాలు....

గోపవరపుగూడెం, చిక్కవరం, గొల్లనపల్లి మిల్లు క్రాస్ రోడ్డు వద్ద దెబ్బతినటంతో వాహనదారులు పడిపోతున్నారు. మద్యం షాపు సమీపంలో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. సమీపంలోని మలుపు వద్ద కాలువ పూడికతీసి ఆ మట్టిని రోడ్డు వెంట కట్టలాగా పేర్చారు. దీంతో రహదారి మలుపు కుంచించుకుపోయింది.

వెంటనే గోతులు పూడ్చాలి.....

ప్రజలకు విస్తృతంగా ఉపయోగపడే ఈ రోడ్డు పరిశీలించి అధికారులు గోతులు వెంటనే పూడ్చించాలని కోరుతున్నారు. అదే విధంగా వెంచర్ మలుపు, వాగు వద్ద కూడా రోడ్డు ధ్వంసం అయ్యింది. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటే మిగిలిన రోడ్డును రక్షించిన వారౌతారని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా తయారైన కేసరపల్లి-ఐటీ పార్కు రహదారి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామం నుంచి ఐటీ పార్కుకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై పూర్తిగా రాళ్లు తేలిపోయి గోతులమయంగా మారింది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐటీ పార్కు ప్రారంభోత్సవం సందర్భంగా 14 ఏళ్ల క్రితం ఈ రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. అనంతరం ఐటీ పార్కు నుంచి రవాణా శాఖ కార్యాలయం వైపుగా జాతీయ రహదారి వరకు ప్రధాన రహదారిని నిర్మించారు. దీంతో కేసరపల్లి నుంచి ఐటీ పార్కు వెళ్లే పాత రహదారిపై రాకపోకలు తగ్గడంతో క్రమంగా దెబ్బతింది. రోడ్డుపై తారు లేయర్ పూర్తిగా తొలగిపోయి రాళ్లు తేలిపోవడంతో భారీగా గుంతలు ఏర్పాడ్డాయి. ఇటీవల విమానాశ్రయం వద్ద నిర్మించిన మినీ ఫ్లైఓవర్ కారణంగా ఐటీ పార్కు ప్రధాన రహదారి నుంచి విజయవాడ వైపు వెళ్లే జాతీయ రహదారి సెంట్రల్ డివైడర్‌ను మూసివేశారు. దీంతో కేసరపల్లి, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు పాత రహదారి మీదుగా మినీ ఫ్లైఓవర్ అండర్‌పాస్ కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గుంతల మయంగా ఉన్న పాత రహదారిపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. పలువురు వాహనదారులు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత రహదారి అభివృద్ధి చేయాలని ఐటీ ఉద్యోగులు, పరిసర ప్రాంత పారిశ్రామిక వేత్తలు, రైతులు కోరుతున్నారు.

ప్రమాదాలు నివారించాలి



మిల్లు వద్ద నుంచి గోపవరపుగూడెం వరకూ రోడ్డు గుంతలు పూడ్చాలి. దెబ్బతిన్న చోట కంకరు వేసి మిగిలిన రోడ్డు పాడవకుండా చర్యలు తీసుకోవాలి. మలుపుల్లో దెబ్బతిన్న రోడ్డు బాగుజేసి ప్రమాదాలు నివారించాలి. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి.

–కొలుసు ఏడు కొండలు, రైతు, గోపవరపుగూడెం

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



గోపవరపుగూడెం రోడ్డును అధికారులు పరిశీలించాలి. మరింత దెబ్బతినకముందే మరమ్మతులు నిర్వహించాలి. మలుపుల్లో ప్రమాదకర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. పలు గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణించే రోడ్డు బాగుచేసేందుకు తక్షణం స్పందించాలి.

–బెజవాడ తాతబ్బాయి, సీపీఎం నాయకుడు

కల్యాణ వేదిక నిర్మాణానికి విరాళాలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ వేదిక నిర్మాణానికి ఆదివారం పలువురు భక్తులు సుమారు రూ. 2 లక్షలు విరాళాలు ఇచ్చారు. గన్నవరానికి చెందిన ఆళ్ల హేమచంద్రముఖర్జీ, రమా చౌదరి దంపతులు రూ. 50,116, విజయవాడకు చెందిన కొసరాజు వెంకటేశ్వరరావు, ఉమాచౌదరి దంపతులు రూ. 50,116, హైదరాబాద్‌కు చెందిన దుగ్గిరాల మాధవరమేష్, లక్ష్మీ దంపతులు రూ. 50,116, పునాదిపాడుకు చెందిన రమణ వరపు పూర్ణచందరరావు రూ. 50 వేలు ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ భక్తులందరి సహాయ, సహకారాలతో శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణాన్ని పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 10.35 గంటలకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా కల్యాణ వేదికను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పంచాయతీ ఆధ్వర్యంలో పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. పొక్లెయిన్ సహాయంతో బల్లెంవారి వీధిలోని ప్రధాన డ్రెయిన్‌ను గత రెండు రోజులుగా పూడిక తీస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంతర్గత డ్రెయిన్లలోని మురుగునీరు సజావుగా పారుదల లేకపోవడంతో పూడిక తీత పనులు చేపట్టినట్లు చెప్పారు. పారుదల లేకపోవడంతోనే బల్లెంవారి వీధిలోని ప్రధాన డ్రెయిన్ పొంగి మురుగు రహదారిపైకి చేరుకుందన్నారు. ఈ సమస్య పరిష్కరించేందుకై అంతర్గత రహదారులతో పాటు ప్రధాన రహదారిపై డ్రెయిన్లు పూడికతీసినట్లు పేర్కొన్నారు.

భగత్‌సింగ్ పోరాట పటిమ ఆదర్శం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



యనమలకుదురులో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న యువజన సంఘాల నేతలు

గన్నవరం: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారుల్లో భగత్‌సింగ్ ముందుంటారని చెప్పారు. ఆయన పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని దేశంలో కార్పొరేట్ శక్తులు సాగిస్తున్న దోపిడీపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకులు పెద్దు రామకృష్ణ, కట్టవరపు రవి, మునగాల సతీష్, సిహెచ్. రాఘవేంద్ర, వీ. ప్రవీణ్, సిహెచ్. నాగరాజు, వై. వినోద్, చాగంటిపాటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: దేశ స్వాతంత్రం కోసం విప్లవ వీరుడు భగత్ సింగ్ చేసిన పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ప్రజానాట్యమండండలి కార్యదర్శి షేక్.కాశిం అన్నారు. యనమలకుదురు గ్రామంలో ఆదివారం సర్దార్ భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాశిం మాట్లాడుతూ భగత్‌సింగ్ 23 సంవత్సరాల వయస్సులోనే దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేశారన్నారు. ఉరికొయను ముద్దాడిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు పి.క్రాంతి, డీవైఎఫ్ఐ నాయకుడు పి.క్రాంతి, షేక్. ఇబ్రహీం,మస్తాన్‌మాలాబి, తులసీరామ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవులను సత్కరించి పురస్కారాలు అందజేస్తున్న గబ్బిట దుర్గాప్రసాద్, వైవీబీ

ఉయ్యూరు: తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు, సాహిత్యాన్ని పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. సరసభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉయ్యూరులోని నాగళ్ల రాజేశ్వరమ్మ జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉగాది పురస్కారాల ప్రదానం, కవి సమ్మేళనం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన కవులు, రచయితలు, సాహితీవేత్తల కవి సమ్మేళనం ఆద్యంతం కమనీయంగా సాగింది. వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన ప్రముఖులు ప్రయాగ రామకృష్ణ, పురాణపండ వైజయంతి, తాడేపల్లి పతంజలి, రాంభట్ల నరసింహ శర్మ, డాక్టర్ దామోదర వెంకట సూర్యారావు, సుశీలమ్మ, అనూరాధ, శ్రీహరి, వేణు, అపర్ణ, శంకర్‌రావు, నెల్లి రాంబాబు, గుత్తికొండ సుబ్బారావు, చలపాక ప్రకాష్, పద్మారాణిలకు పురస్కారాలు అందించి సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, సరసభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ పురస్కారాలను ప్రదానం చేసి సాహిత్య కళారంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కవులు, రచయితలు, సాహితీవేత్తల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, సంస్థ ప్రతినిధులు శివలక్ష్మి, గబ్బిట వెంకటరమణ, రామనాథబాబు పాల్గొన్నారు.

జానకిరామశర్మ, ఫణికుమార్‌కు జ్యోతిష్య రత్న అవార్డులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: శ్రీ విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ (సికింద్రాబాద్) ఆధ్వర్యంలో ఏటా బహూకరించే 'జ్యోతిష్య రత్న' అవార్డుకు సామవేదం జానకిరామశర్మ ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ప్రతినిధులు, ఐకాస్ సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు చేతుల మీదగా జ్యోతిష్య రత్న అవార్డును స్వీకరించినట్లు జానకిరామశర్మ స్థానిక విలేకర్లకు తెలిపారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలోని శ్రీకాశీ విశాలక్షి సమేత విశ్వనాథ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులుగా జానకిరామశర్మ పని చేస్తున్నారు. జ్యోతిష్య రత్న అవార్డు అందుకున్న జానకిరామశర్మకు బ్రాహ్మణ సంఘాల కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన ఆస్ట్రాలజిస్ట్ గోల్డ్ మెడల్ విన్నర్ డాక్టర్ మామిళ్ళపల్లి ఫణికుమార్‌కు జ్యోతిష్య మిత్ర అవార్డును ప్రదానం చేసింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఉగాది పురస్కారాలను విజయవాడలో ఆదివారం ప్రదానం చేసింది. సంస్థ చైర్మన్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అతిథులు ఫణికుమార్‌కు అవార్డును ప్రదానం చేశారు. శ్రీకంచి కామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి లక్కవజుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి, శతాధిక గ్రంథ సంకలన కర్త ఆదిపూడి శివసాయిరామ్, జ్యోతిష్య విశారద గ్రంథ రచయిత పాలపర్తి శ్రీకాంతశర్మ, పుచ్చా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిప్పనగుంటలో ఎమ్మార్పీఎస్ విజయోత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించటంపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించిన ఘనత పూర్తిగా మంద కృష్ణమాదిగకే దక్కుతుందని కొనియాడారు. డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు గండేపూడి నితీష్‌కుమార్, ముదునూరు కొండలరావు, మద్దాల రంగారావు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

పెనమలూరు: పెదపులిపాక గ్రామ పంచాయతీలో గతంలో జరిగిన నిధులు దుర్వినియోగంపై డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరి కోరారు. ఆయన ఆదివారం డెప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివరాలు తెలుపుతూ 2014 సంవత్సరంలో గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పని చేసిన సోమయ్య నిధులు దుర్వినియోగం చేశారని అధికారులు విచారణలో తేల్చారన్నారు. ఆడిట్ రిపోర్టులో రూ.9 లక్షలు తేడా వచ్చినట్లు అధికారులు గుర్తించారన్నారు. నిధులు రికవరీకి ఇప్పటికి రెండు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకొని నిధులు రికవరీ చేయాలని కోరారు.

బెట్టింగ్ యాప్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువత బెట్టింగ్ యాప్స్ వలలో పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాసులు సూచించారు. ఇటీవల బెట్టింగ్ యాప్స్ పెచ్చురిల్లుతున్నాయని, ఈ యాప్స్ పూర్తిగా మోసపూరితమైనవని ఆదివారం ఆయన తెలిపారు. యువత ఈజీ మనీ ఆశలో పడి ఈ యాప్స్ వినియోగిస్తూ, చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని చెప్పారు. బెట్టింగ్ యాప్స్ వినియోగం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడటమే కాకుండా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేని బెట్టింగ్ యాప్స్ వినియోగించటం పూర్తిగా నేరమని, చట్టరీత్యా శిక్షార్హమని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన

గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ దళితుల ఆశాజ్యోతి అంబేద్కర్ పట్ల అవమానకరంగా ప్రవర్తించడం దుర్మార్గమని తెలిపారు. సంఘ నేతలు టి. భాస్కరరావు, ఢిల్లీ నాగేశ్వరరావు, నిమ్మకూరి రూబేను, పచ్చిగళ్ళ మేరీ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఉంగుటూరు: రౌడీ షీటర్లు, సస్పెక్టులు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ గోవిందు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు, సస్పెక్ట్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా ఉండాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడిన, విక్రయించిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమాజంలో మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని తెలిపారు.

మహిళలకు రక్షణ కల్పించాలని ఆందోళన

ఐద్వా డిమాండ్



తాడిగడపలో నిరసన తెలుపుతున్న ఐద్వా

పెనమలూరు: రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు నానాటికీ పెరుగుతున్నాయని, ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించాలని మండల ఐద్వా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పుసులూరి పాతాళలక్ష్మి, సీహెచ్.భవాని డిమాండ్ చేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకిలో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పుసులూరి పాతాళలక్ష్మి, సీహెచ్ భవాని మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జి.కొండూరు, వీరపనేని గూడెంలో బాలికలపై జరిగిన ఘటనలు చాలా దారుణమని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు నానాటికీ దిగజారుతున్నా ప్రభుత్వంలో స్పందన కనబడటం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సంఘ నేతలు ఉప్పాడ ఈశ్వరి, చిప్పాలక్ష్మి, దుర్గ, వరలక్ష్మి, ఉప్పాడ త్రిమూర్తి, లక్ష్మీనారాయణ, సోమశేఖర్ పలువురు పాల్గొన్నారు.

బీసీ రుణాల కోసం 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

విజయవాడ రూరల్: వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ నుంచి రుణాల కోసం దరఖాస్తు చేసుకొనే వారికి ఈ నెల 25వ తేదీ వరకు గడువు పెంచామని రూరల్ ఎంపీడీఓ (ఇన్‌చార్జి) పి. మురళీకృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి పథకాలు, జనరిక్ మందుల షాపులు, బుట్టల అల్లకం (మేదరి) కుటుంబాలు, కుండల తయారీ (కుమ్మరి/శాలివాహన)కుటుంబాలు, కుట్టుమిషన్ కోసం రుణం పొందటానికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు దారులు బీసీ కులములో ఏ,బీ,సీ,డీ గ్రూపులకు చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రం కల్గివుండి 21–60 సంవత్సరాల లోపు వయస్సు, వార్షికాదాయం రూ.81 వేలు ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు విజయవాడ లోని మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కంకిపాడు: వివిధ కార్పొరేషన్‌ల కింద స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఈ నెల 25వ తేదీ వరకూ పొడిగించినట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, కాపు, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, మేదర, కుమ్మరి సామాజిక వర్గాల నుంచి అర్హులైన యువత స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ చేపట్టామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 25వ తేదీ వరకూ పొడిగించామన్నారు. కాపు కార్పొరేషన్‌కు సంబంధించి వయో పరిమితి 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వరకూ పొడిగించారన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఈ నెల 25 వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

గన్నవరం: వివిధ కార్పొరేషన్‌లు ద్వారా రాయితీపై రుణాలు పొందేందుకు దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ టి. స్వర్ణలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు, మేదరి, కుమ్మరి కార్పొరేషన్ రుణాలు కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ పేర్లను ఏపీ-ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

మురుగు పారుదలకు ప్రత్యేక చర్యలు

సాక్షి స్పందన



వ్యర్థాల తొలగింపు పనుల్లో పారిశుద్ధ్య కార్మికుడు

కంకిపాడు: డ్రెయిన్లలో పేరుకున్న వ్యర్థాల తొలగింపు పనులపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాల తొలగింపు, మురుగు పారుదలకు అవసరమైన చర్యలకు ఉపక్రమించారు. 'పూడుకుపోయి...ముందుకు కదలక' శీర్షికతో ఈ నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనానికి కంకిపాడు పంచాయతీ అధికారులు స్పందించారు. వ్యర్థాలతో మేట వేసుకుని, మురుగు పారుదల అవ్వని డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులను ఆదివారం చేపట్టారు. పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఒకటో తూము వద్ద నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకూ ప్రధాన డ్రెయిన్లు, అనుబంధ డ్రెయిన్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వ్యర్థాలు, పూడిక తీత తొలగింపు పనులు చేపడతామని తెలిపారు. అవసరమైతే ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.